
ఆంధ్రజ్యోతి



5 సిద్దిపేట

బుధవారం 5 మార్చి 2025



వినతిపత్రాలను స్వీకరిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రభుత్వ సంక్షేమ పథకాలను
ప్రజల్లోకి తీసుకెళ్లండి

- మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మంత్రి ప్రభాకర్ పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పథకాలు అందని వారి వివరాలను సేకరించి ఇవ్వాలని సూచించారు. మంగళవారం ఆయన హుస్నాబాద్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని మండలాల వారీగా పార్టీ కార్యకర్తలు, ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. గ్రామాల్లో నెలకొన్న ప్రధాన సమస్యలు, వినతులను స్వీకరించారు. పలు సమస్యలను అధికారులతో మాట్లాడి అక్కడికక్కడే పరిష్కరించారు. ఇందులో ఎక్కువగా చాలా మంది యువతీ యువకులు ఉపాధి అవకాశాలు కల్పించాలని మంత్రికి వినతిపత్రాలు ఇచ్చారు. బుధవారం క్యాంపు కార్యాలయంలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేసవి ప్రారంభమైన దృష్ట్యా తాగునీటి సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతి నాయకుడికీ మంచి అవకాశాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, నియోజకవర్గ జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి రోబోటిక్స్ ప్రదర్శన



ఎగ్జిబిట్లు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

సిద్దిపేటకల్చరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో సోహం అకాడమీ సౌజన్యంతో మంగళవారం జిల్లాస్థాయి రోబోటిక్స్ ప్రదర్శన నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లావ్యాప్తంగా 14 ప్రభుత్వ పాఠశాలలు, రెండు ప్రైవేట్ పాఠశాలల నుంచి సుమారు 40 ఎగ్జిబిట్లను ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచిన ఎగ్జిబిట్స్ నమూనాలకు కృషికల్ప ఎన్‌జీవో సీఈవో పాటిల్ రూ.5వేల నగదు బహుమతిని అందించారు. కార్యక్రమ నిర్వాహక కార్యదర్శి డాక్టర్ హెచ్.మధుసూదన్, కార్యక్రమ కన్వీనర్ బి.కృష్ణయ్య, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.అయోధ్యరెడ్డి, పరీక్షల కంట్రోలర్ గోపాల సుదర్శనం, జిల్లా విద్యాశాఖ ఎ.ఓ రామస్వామి, భౌతిక శాస్త్ర అధ్యాపకులు సత్యనారాయణరెడ్డి, రజిని, మహేష్ కుమార్, జి. సౌమ్య, ఎన్. భైరయ్య, వివిధ పాఠశాలల టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



మెదక్ పార్లమెంటు నియోజకవర్గ నేతలతో సమావేశమైన కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్

పార్టీ లైన్ దాటొద్దు

- కాంగ్రెస్‌లో విభేదాలకు తావు లేదు
- రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి
- మెదక్ పార్లమెంటు నియోజకవర్గ ముఖ్య నేతలతో సమీక్ష
- అసెంబ్లీ సెగ్మెంట్లవారీగా అభిప్రాయ సేకరణ
- త్వరలోనే సీనియర్లతో సమన్వయ కమిటీ.. పరిశీలకుల నియామకం
- ఈ నెలలోనే నియోజకవర్గాల్లో పాదయాత్రలు
- ఎమ్మెల్యే గూడెం వైఖరిపై మండిపడిన కాటా శ్రీనివాస్‌గౌడ్
- రెండు గంటలు ఉత్కంఠగా సాగిన సమావేశం

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, మార్చి 4: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరించిన మీనాక్షి నటరాజన్ మెతుకుసీమలో పార్టీని చక్కదిద్దడంపై దృష్టిపెట్టారు. రాష్ట్రంలోని 17 లోక్‌సభ స్థానాల్లో మెదక్ నేతలకే ముందుగా పిలుపు వచ్చింది. మెదక్ పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో పార్టీని బలోపేతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై మంగళవారం ఆమె చర్చించారు. సమీక్షకు ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ, మంత్రి దామోదర్ రాజనర్సింహ, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జిలు, మూడు జిల్లాల పార్టీ అధ్యక్షులు, స్థానిక ముఖ్యనేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రూపులు, విభేదాలపై మీనాక్షి నటరాజన్ సున్నితంగా హెచ్చరించారు. పార్టీలైన్ దాటితే చర్యలు తప్పవని సంకేతాలిచ్చారు.

మెదక్ పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లు ఉండగా ఆరు చోట్ల బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలే గెలిచారు. మెదక్ అసెంబ్లీ స్థానంలో మాత్రం కాంగ్రెస్ నుంచి మైనంపల్లి రోహిత్ గెలుపొందారు. పార్టీ బలహీనంగా ఉన్న పార్లమెంటు స్థానం కావడంతో మీనాక్షి నటరాజన్ ముందుగా ఈ స్థానాన్నే ఎంచుకున్నారు. ఇక్కడ కాంగ్రెస్ వెనుకబడడానికి గల కారణాలపై నేతలతో చర్చించారు. దాదాపు 2 గంటలు అనేక విషయాలపై చర్చించారు.

పటాన్‌చెరు పంచాయితీ

పార్టీ నూతన ఇన్‌చార్జి మీనాక్షి ఎదుట పటాన్‌చెరు నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్ పలు విషయాలను ఉంచారు. తన అభిప్రాయాన్ని పరిగణలోకి తీసుకోకుండానే బీఆర్‌ఎస్ నుంచి గెలిచిన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి పార్టీలో చేరారని చెప్పారు. గడిచిన పదేళ్లలో కాంగ్రెస్ పార్టీ నేతలను, కార్యకర్తలను ఇబ్బందులకు గురిచేసిన అధికారులకే మళ్లీ నియోజకవర్గంలో పోస్టింగులు ఇప్పించుకున్నారని వాపోయారు. పటాన్‌చెరులో కాంగ్రెస్ శ్రేణులంతా అసంతృప్తితో ఉన్నారని వివరించారు. ఇటీవల టీపీసీసీ కమిటీ సభ్యులు విచారణ చేసినా చర్యలు తీసుకోలేదని తెలిపారు.

సెగ్మెంట్లలో సమస్యలపై ఆరా..

అసెంబ్లీ సెగ్మెంట్లవారీగా మీనాక్షి పార్టీ పరిస్థితి గురించి ఆరా తీశారు. సంగారెడ్డి, సిద్దిపేట, మెదక్ జిల్లాల పార్టీ అధ్యక్షుల అభిప్రాయాలను విన్నారు. మెదక్ ఎమ్మెల్యే రోహిత్, ఆరు నియోజకవర్గాల ఇన్‌చార్జిలు చెప్పిన అంశాలను పరిగణనలోకి తీసుకున్నారు. ఇతర నేతలకు కూడా మాట్లాడే అవకాశం కల్పించారు. నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ బలాలు, బలహీనతల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సమీక్ష కేవలం అవగాహన కోసమేనని త్వరలోనే మరోసారి సమావేశమై క్షుణ్ణంగా చర్చించనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

పార్టీ బలోపేతానికి రూట్‌మ్యాప్

మెతుకుసీమలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడానికి రూట్‌మ్యాప్ సిద్ధం చేస్తున్నట్లు మీనాక్షి పేర్కొన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో ముఖ్య నేతలతో సమన్వయ కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు తెలిసింది. వీరి ద్వారా నియోజకవర్గాలవారీగా ఉన్న సమస్యలు, గ్రూపు తగాదాలను పరిష్కరించనున్నారు. అదేవిధంగా టీపీసీసీ నుంచి ప్రతీ నియోజకవర్గానికి ఇద్దరు పరిశీలకులను నియమించనున్నట్లు తెలిసింది. స్థానిక ఎన్నికల అభ్యర్థుల ఎంపికతోపాటు నామినేటెడ్ పోస్టుల భర్తీపై వీరు దృష్టి పెడతారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాల గురించి నియోజకవర్గాలవారీగా పాదయాత్రలు చేపట్టేందుకు స్థానిక నేతలు సిద్ధంగా ఉండాలని ఆమె సూచించినట్లు సమాచారం.

నేటినుంచి ఇంటర్ పరీక్షలు

- జిల్లా వ్యాప్తంగా 43 కేంద్రాలు



సిద్దిపేటలోని ఓ సెంటర్‌లో హాల్‌టికెట్ నంబర్లు వేస్తున్న సిబ్బంది

సిద్దిపేట కల్చరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : నేటి నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభంకానున్నాయి. మార్చి 24 వరకు పరీక్షలు కొనసాగనున్నాయి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు కొనసాగుతాయి. సెంటర్ల వద్ద 163 ఎన్‌ఎస్‌ఎస్ సెక్షన్ అమలులో ఉండనున్నది. జిల్లావ్యాప్తంగా 43 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా ఇందులో 20 ప్రభుత్వ కళాశాలలు, 9 గవర్నమెంట్ సెక్టార్ కాలేజీలు, 14 ప్రైవేట్ కాలేజీల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రథమ సంవత్సరం 9770 మంది, ద్వితీయ సంవత్సరంలో 10815 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. పరీక్షలు మొత్తం సీసీ కెమెరా నిఘాలో కొనసాగనున్నాయి.

'నీట్'కు కేంద్రాల పరిశీలన



ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న డిస్ట్రిక్ట్ లెవెల్ కోఆర్డినేషన్ కమిటీ

సిద్దిపేట కల్చరల్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): నీట్ యూజీ 2025 ఎంట్రన్స్ కోసం పరీక్ష కేంద్రాలను జిల్లాస్థాయి కోఆర్డినేషన్ కమిటీ ఛైర్‌పర్సన్, కలెక్టర్ మనుచౌదరి, సీపీ అనురాధతో కలిసి జిల్లా కేంద్రంలోని పలు విద్యాసంస్థలను పరిశీలించారు. మే 4న జిల్లాలోని మూడు సెంటర్లలో నీట్ ఎంట్రన్స్ పరీక్షను నిర్వహించనున్నారు. ఇందు కోసం జిల్లా కేంద్రంలో ప్రతిభ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సిద్ధార్థ హైస్కూల్, పొన్నాల శివారులోని ఇందూర్ కళాశాల, వికాస్ హైస్కూల్‌ను క్షేత్ర స్థాయిలో నేషనల్ టెస్టింగ్ కమిటీ ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం పరిశీలించారు. డిస్ట్రిక్ లెవెల్ కోఆర్డినేషన్ కమిటీ మూడు సెంటర్లను ఎంపిక చేసి ఆ నివేదికను పైఅధికారులకు పంపనున్నట్లు కలెక్టర్ తెలిపారు. వీరి వెంట ఏఆర్ అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్, డీఈవో శ్రీనివాస్‌రెడ్డి, పలువురు ఉన్నారు.

కోట్లు వెచ్చించారు.. వదిలేశారు

- అర్థాంతరంగా నిలిచిపోయిన గ్రామీణ ఫంక్షన్‌హాళ్ల నిర్మాణం
- గజ్వేల్ నియోజకవర్గంలో 68కి పూర్తయినవి 20 మాత్రమే
- వసతులు లేకపోవడంతో వినియోగించలేని దుస్థితి

8

ఆంధ్రజ్యోతి ఫోకస్



గజ్వేల్ మండలం బయ్యారంలో నిర్మాణం పూర్తయినా అందుబాటులోకి రాని ఫంక్షన్‌హాల్



హరియాణా గవర్నర్ దత్తాత్రేయ, ఎంపీ రఘునందన్‌రావుకు గొంగడి బహూకరించిన కొమురవెల్లి మల్లన్న ఆలయ ఒగ్గుపూజారుల సంఘం అధ్యక్షుడు కనకయ్య తదితరులు

కొమురవెల్లి, కొండపోచమ్మ ఆలయాల్లో
హరియాణా గవర్నర్ పూజలు

జగదేవ్‌పూర్/చేర్యాల, మార్చి 4(ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లాలోని కొమురవెల్లి మల్లికార్జున స్వామిని, జగదేవ్‌పూర్ మండలం తిగుల్‌నర్సాపూర్ సమీపంలోని కొండపోచమ్మ అమ్మవారిని మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్‌రావుతో కలిసి హరియాణా గవర్నర్ దత్తాత్రేయ, వారి కుటుంబ సభ్యులు దర్శించుకున్నారు. గవర్నర్ దత్తాత్రేయకు, ఎంపీ రఘునందన్‌రావుకు ఆలయ నిర్వాహకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. కొండపోచమ్మ ఆలయంలో గవర్నర్ దత్తాత్రేయకు ఇష్టమైన స్వీట్ 65 కేజీల జిలేబీతో తులాభారం నిర్వహించారు. కురుమ సంఘం ఆధ్వర్యంలో దత్తాత్రేయను గొంగడితో సత్కరించారు. కొండపోచమ్మ ఆలయం వద్ద ఫంక్షన్‌హాల్ నిర్మాణానికి నిధులు కేటాయించాలని తాజా మాజీ సర్పంచ్ రజిత రమేష్ ఎంపీకి వినతిపత్రం అందజేశారు. కొమురవెల్లిలో ముఖమండపంలో ఒగ్గు పూజారులచే పట్నం రచించి మొక్కులు తీర్చుకున్నారు. గవర్నర్ దత్తాత్రేయ, ఎంపీ రఘునందన్‌రావును ఒగ్గుపూజారులు గొంగడిని బహూకరించారు. అనంతరం రేణుకాచార్య మండప ఆవరణలో దేవాదాయశాఖ ఆర్‌జేసీ రామకృష్ణారావు, ఈవో రామాంజనేయులు స్వామి వారి చిత్రపటం, ప్రసాదం బహూకరించారు. అంతకుముందు కలెక్టర్ మనుచౌదరి, సీపీ అనురాధ, అడిషనల్ కలెక్టర్ అబ్దుల్ హమీద్ మర్యాదపూర్వకంగా కలిశారు.


ఫంక్షన్‌హాల్ నిర్మాణానికి కృషి : ఎంపీ

కొండపోచమ్మఆలయం వద్ద ఫంక్షన్‌హాల్ నిర్మాణానికి తన నిధుల నుంచి లేదా టీటీడీ నుంచి నిధులను కేటాయిస్తానని ఎంపీ రఘునందన్ రావు అన్నారు. ప్రధానమంత్రి సహకారంతో కురుమ సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శంకర్, కప్పర ప్రసాద్‌రావు, బీజేపీ మండల అధ్యక్షుడు అయిలయ్యయాదవ్, గుర్రం శ్రీదర్, బుద్ధ మహేందర్, బాల్‌రాజు, రాములు, ఎల్లు రాంరెడ్డి, సిత్తయ్య, నాగరాజు, కెఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బింగి స్వామి ఉన్నారు.

ఏడోవారం మల్లన్న ఆలయ బుకింగ్ ఆదాయం రూ.59.20లక్షలు

చేర్యాల, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లన్న ఆలయంలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా 7వ వారాన్ని పురస్కరించుకుని భక్తులు వేలాదిగా తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు సమర్పించిన మొక్కుబడులు, తలనీలాలు, నిర్వహించిన ఆర్జితసేవలు, వసతి గదుల అద్దె, ప్రసాద విక్రయాలు, ప్రత్యేక దర్శనాలు, విరాళాలు, ఇతరత్రా రూపం లో శనివారం రూ.4,06,131, ఆదివారం రూ.48,09,992, సోమవారం రూ.7,04,538, చొప్పున మొత్తంగా రూ.59,20,661 ఆదాయం సమకూరింది.

వేసవి విద్యుత్‌కు
ఇబ్బందుల్లేవ్



- జిల్లా వ్యాప్తంగా 5,86,350 విద్యుత్ కనెక్షన్లు
- గృహ వినియోగదారులు 3,52,800, కమర్షియల్ 44,989
- ప్రతి నెలా విద్యుత్ బిల్లులు రూ. 24 కోట్ల
- మార్చి నుంచి మే వరకు ప్రత్యేక ప్రణాళిక
- అవసరమైతే తప్ప విద్యుత్ కోతలు లేకుండా చర్యలు
- ఇటీవల రూ. 45 కోట్లతో అడిషనల్ ట్రాన్స్‌ఫార్మర్లు, మెయింటెనెన్స్ పనులు పూర్తి
- రెండేళ్లతో పోల్చితే పెరిగిన విద్యుత్ వినియోగం
- ఈ ఏడాది మూడు నెలలకు గాను 890 మిలియన్ యూనిట్ల డిమాండ్
- జిల్లాలోని 180 స్టేషన్లలో 720 మంది సిబ్బందితో పర్యవేక్షణ

సిద్దిపేట టౌన్, మార్చి4 (ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి చివరి వారం నుంచే ఎండలు దంచికొడుతున్నాయి. వేడి నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు ఏసీలు, కూలర్ల వైపు మొగ్గుచూపుతున్నారు. వేసవిలో విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉంటుంది. ఈ క్రమంలో అధికారులు రెండేళ్లుగా ఏఏ ప్రాంతాల్లో విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉంటుందో ఆరా తీస్తున్నారు. లోఓల్టేజీ సమస్య తలెత్తకుండా అటు వ్యవసాయ రంగానికి ఇటు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్‌నందించేందుకు అధికారులు ప్రణాళిక ప్రకారం సర్వం సిద్ధం చేశారు. మార్చి, ఏప్రిల్, మే నెలలకు గాను 2023లో 693.50 మిలియన్ యూనిట్లు, 2024లో 773.43 మిలియన్ యూనిట్ల విద్యుత్ డిమాండ్ రాగా ఈ ఏడాది ఆ మూడు నెలలకు 890 మిలియన్ యూనిట్ల విద్యుత్ డిమాండ్ వచ్చే అవకాశమున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. రాబోయే మూడు నెలల కాలానికి సంబంధించి పెరగనున్న విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని ఆ దిశగా చర్యలు చేపడుతున్నారు.

జిల్లావ్యాప్తంగా 180 విద్యుత్ సబ్‌స్టేషన్లు

జిల్లావ్యాప్తంగా 5,86,350 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో గృహానికి సంబంధించి విద్యుత్ కనెక్షన్లు 3,52,800, కమర్షియల్ విద్యుత్ కనెక్షన్లు 44,989, వ్యవసాయరంగానికి సంబంధించి 1,73,360 విద్యుత్ కనెక్షన్లు ఉండగా, ఇండస్ట్రీయల్, గ్రామాలు, పట్టణాల్లో విద్యుత్ దీపాలు, వాటర్ వర్క్స్ సంబంధించి 20వేల వరకు విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను వినియోగించే 1,81,365 మంది గృహజ్యోతి పథకం కింద దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులున్నారు. జిల్లా వ్యాప్తంగా 180 విద్యుత్ సబ్‌స్టేషన్లు, దాదాపు 35 వేల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ద్వారా గృహ వినియోగదారులకు విద్యుత్‌ను అందిస్తున్నారు.

మే వరకు ప్రత్యేక ప్రణాళిక

ఏటా పెరుగుతున్న విద్యుత్ డిమాండ్ దృష్ట్యా వేసవిలో జిల్లా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మార్చి నుంచి మే వరకు విద్యుత్ అధికారులు ప్రత్యేక ప్రణాళికా రూపొందించుకున్నారు. ఈ మేరకు ఇటీవలే జిల్లాలో రూ.45కోట్లతో అవసరమున్న చోట అడిషనల్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడంతో పాటు, మెయింటెనెన్స్ పనులు, డిమాండుకు తగ్గట్టుగా కెపాసిటీ పెంచేలా 33/11 కేవీ లైన్లకు సంబంధించిన పను లు పూర్తి చేసి నాణ్యమైన విద్యుత్ సరఫరాను అందించేందుకు విద్యుత్ అధికారులు పూర్తి చేశారు. మూడు నెలల పాటు జిల్లాలోని మూడు డివిజన్లు, 9 సబ్ డివిజన్లు, 37 సెక్షన్లలో 720 మంది సిబ్బంది అందుబాటులో ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.

కోతలు లేకుండా చర్యలు

జిల్లా వ్యాప్తంగా ప్రజలకు నిరంతరంగా విద్యుత్ అందించేందుకు కృషి చేస్తుండగా అవసరమైతే తప్ప ఒక్క క్షణం కూడా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా చూడాలని ఉన్నతాధికారులు సిబ్బందిని ఆదేశించారు. దాంతో పాటు ప్రజలకు తాగునీటి ఎద్దడి లేకుండా తాగునీటి సౌకర్యార్థం అందిస్తున్న వాటర్ వర్క్స్, మున్సిపల్ శాఖ అందిస్తున్న తాగునీటి వసతుల విషయంలో విద్యుత్ సరఫరాకు ఆటంకం లేకుండా చూడాలని అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే ఈ విషయమై జిల్లా ఉన్నతాధికారులతో పాటు రాష్ట్ర స్థాయి అధికారులు సిద్దిపేటను సందర్శించి విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు.



సిద్దిపేటలోని విద్యుత్ సబ్‌స్టేషన్

పెరిగిన డిమాండ్

రెండేళ్లలో పోల్చితే ఈ ఏడాది విద్యుత్ డిమాండ్ పెరిగిందని అధికారులు వెల్లడిస్తున్నారు. ఈ ఏడాది మూడు నెలలకు విద్యుత్ 890 మిలియన్ యూనిట్ల అవసరముందని అంచనా వేశారు. ఎండాకాలం నేపథ్యంలో 2023లో మార్చిలో 319.57 మిలియన్ యూనిట్లు, ఏప్రిల్‌లో 261.32 మిలియన్ యూనిట్లు, మేలో 112.67 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం కాగా, ఈ 2024లో మార్చిలో 359.05 మిలియన్ యూనిట్లు, ఏప్రిల్‌లో 271.06 మిలియన్ యూనిట్లు, మేలో 143.32 మిలియన్ యూనిట్లు వినియోగమయ్యింది. వ్యవసాయరంగంగా ఏప్రిల్ వరకు వినియోగం తగ్గినప్పటికి, ఎండ తీవ్రతను బట్టి వినియోగదారులు, ఏసీ, కూలర్లు ఎక్కువగా వినియోగించడంతో ఈ స్థాయికి చేరినట్లు విద్యుత్ అధికారులు వెల్లడిస్తున్నారు.

ప్రతినెలా విద్యుత్ బిల్లులు రూ.24 కోట్లు

జిల్లాలో గృహ, కమర్షియల్, ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించి ప్రతి నెల బిల్లుల రూపంలో రూ.24 కోట్లు వసూలు చేస్తున్నారు. ఈ బిల్లులు మార్చి వరకు కాగా, ప్రారంభమైన గృహజ్యోతి పథకంతో దరఖాస్తు చేసుకున్న 1,81,365 లబ్ధిదారులకు జీరో బిల్స్ వస్తున్నాయి. రెండు నెలలుగా వీరిలో నుంచి దాదాపు 10

మిగతా 8వ పేజీలో

భవిత కేంద్రాల సామగ్రికి నిధులు

సంగారెడ్డి అర్బన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : ప్రత్యేక అవసరాల పిల్లలు విద్యనభ్యసించే భవిత కేంద్రాలకు విద్యాశాఖ నిధులు విడుదల చేసింది. జిల్లాలో ఆరు భవిత కేంద్రాలుండగా ఒక్కో కేంద్రానికి రూ.2 లక్షల చొప్పున రూ.12 లక్షల నిధులు కేటాయించింది. భవిత కేంద్రాల్లోని ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు 115 రకాల సామగ్రి కొనుగోలును సమగ్ర శిక్షా అభియాన్ కింద నిధులు మంజూరు చేశారు. విద్యార్థులకు అర్థమయ్యేలా బోధనోపకరణాలు, ఐఈఆర్‌పీలకు కుర్చీలు, చికిత్స అందించే బళ్లలు, మసాజ్‌బాల్, డంబుల్స్, రౌండ్ టేబుల్, అల్మారాలు తదితర సామగ్రి కొనుగోలుకు ఈ నిధులు వెచ్చించాల్సి ఉంటుంది.

ప్రభుత్వ భూమిలో ఆక్రమణల తొలగింపు

అమీన్‌పూర్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ భూమిని కబ్జాచేసి నిర్మించిన గదులను అమీన్‌పూర్ రెవెన్యూ సిబ్బంది మంగళవారం కూల్చివేశారు. పట్టణంలోని సర్వే నంబరు 673లో కొందరు వ్యక్తులు రెండురోజులుగా ప్రభుత్వ భూమిని ఆక్రమించి గదులను నిర్మించడం ప్రారంభించారు. రాత్రికిరాత్రే గదులను నిర్మించి బయట నుంచి పెయింట్ సైతం వేశారు. గదుల గోడలపై ఇంటి నంబరుగా పేర్కొంటూ కొన్ని నంబర్లను రాయడం గమనార్హం. కాగా రెవెన్యూ సిబ్బంది ఎక్స్‌వేటర్ సహాయంతో నిర్మించిన ఆరు గదులను నేలమట్టం చేశారు. కబ్జాలకు పాల్పడుతున్న వారిని గుర్తిస్తున్నామని ఆర్‌ఐ రఘువర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు... వ్యక్తి మృతి

చేగుంట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి మృతిచెందాడు. చేగుంట మండల పరిధిలోని సోమ్లాతండాకు చెందిన గుగులోత్ లాలు (42) ఫిబ్రవరి 27న చేగుంట మండలం పొలంపల్లి గ్రామ శివారులో రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతిచెందాడు. మృతుడికి భార్య లలిత, ఇద్దరు కుమారులు వరుణ్, నిఖిల్, ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



లాలు(ఫైల్)

ఆటో, బైక్ ఢీ, నలుగురికి తీవ్రగాయాలు

వెల్దుర్తి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : ఆటో, బైక్ ఢీకొని నలుగురికి తీవ్రగాయాలైన సంఘటన మండల పరిధిలోని కుకునూర్ గ్రామ శివారులో మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. చిన్నశంకరంపేట మండలం జంగరాయి గ్రామానికి చెందిన విశాల్, రాజు, జగన్ ఒకే బైక్‌పై నర్సాపూర్‌లో జరిగే రిసెప్షన్‌కు బయలుదేరారు. చిన్నశంకరంపేట మండలానికి చెందిన ప్రకాష్ తన ఆటోలో నర్సాపూర్ నుంచి వెల్దుర్తి వైపు వస్తున్నాడు. ఈ క్రమంలో కుకునూర్ గ్రామ శివారు వద్ద రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో ఆటోలో ఉన్న ప్రకాష్‌తో పాటు బైక్‌పై ఉన్న ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి సంబంధించి ఫిర్యాదు రాలేదని పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తికి..

చేగుంట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి వివరాల ప్రకారం.. చేగుంట గ్రామానికి చెందిన సోమ రమేష్ చేగుంట నుంచి ద్విచక్ర వాహనంపై తూప్రాన్‌కు వెళ్తున్నాడు. వడియారం బైపాస్ వద్ద గుర్తుతెలియని వాహనం ద్విచక్ర వాహనం వెనక నుంచి ఢీకొనడంతో రమేష్‌కు తీవ్రగాయాలయ్యాయి. రమేష్‌ను 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



గాయపడిన రమేష్

క్రైం కార్నర్

వీడిన మహిళ మర్డర్ మిస్టరీ

గుమ్మడిదల, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మాయమాటలు చెప్పి మహిళను అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి.. హత్య చేసిన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. జిన్నారం సీఐ ఎండీ నయీముద్దీన్ కథనం ప్రకారం.. మెదక్ జిల్లా నర్సాపూర్ మండలానికి చెందిన గుగులోత్ పూర్యా.. కౌడిపల్లి మండలానికి చెందిన ఓ మహిళను గతేడాది డిసెంబర్ 28న గుమ్మడిదల కల్లు కంపౌండ్‌లో కలుసుకున్నాడు. కల్లుతాగే సమయంలో ఆమెకు మాయమాటలు చెప్పి, నల్లవల్లి అటవీ ప్రాంతానికి తీసుకెళ్లారు. ఇద్దరూ అక్కడ సన్నిహితంగా మెలిగారు. అనంతరం ఆమె గొంతుకు చున్నీ చుట్టి ఊపిరాడకుండా చేసి, చంపేశాడు. మహిళ కనిపించకపోవడంతో ఆమె భర్త గుమ్మడిదల పోలీసులకు ఫిర్యాదు చేశారు. తర్వాత ఆమె మృతదేహం దొరకగా, కేసు మిస్టరీగా మారింది. జిన్నారం సీఐ ఎండీ నయీముద్దీన్ ఆధ్వర్యంలో ఎస్సై ఎం. మహేశ్వర్‌రెడ్డి, కానిస్టేబుళ్లు పి. వెంకటేశం, సికిందర్, టి. కిషోర్, కె.సాయివర్ధన్‌రెడ్డిలు సీసీ కెమెరాల ద్వారా నిందితుడిని గుర్తించారు. మంగళవారం నిందితుడిని పట్టుకుని, నేరం చేసేందుకు వినియోగించిన వాహనం, సెల్‌ఫోన్‌ను సీజ్ చేశారు. నిందితుడిని రిమాండ్‌కు పంపించారు. మిస్టరీ కేసును ఛేదించిన పోలీసులను సీఐ అభినందించారు.

భార్య కాపురానికి రావడం లేదని ఆత్మహత్య


రమేష్ (ఫైల్)

కొండపాక, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య సమస్యలతోపాటు భార్య కాపురానికి రాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కొండపాక మండలం దుద్దెడ పంచాయతీ పరిధిలోని సేలంపు గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన చిలుముల రమేష్ (35) ప్లంబర్ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. భార్య కాపురానికి రాకపోవడంతో ఒంటరిగా ఉంటున్నాడు. కలత చెందిన ఆయన జీవితంపై విరక్తి చెందిన ఆయన ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు చూసేసరికి అప్పటికే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసినట్టు ఆయనను వివరించారు.

కుటుంబ తగాదాలతో ఒకరు..



సందీప్ (ఫైల్)

చేర్యాల, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కుటుంబకలహాలతో మనస్థాపానికి గురై ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి.. ఆస్పత్రిలో మంగళవారం మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని తాడూరుకు చెందిన చెరుకు సందీప్ (32)కు కుటుంబ సభ్యులకు కొద్దిరోజులుగా గొడవలు జరుగుతున్నాయి. దీంతో మనస్థాపం చెందిన సందీప్ ఇటీవల గ్రామ శివారులో గడ్డి నివారణ మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన స్థానికులు చేర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, వైద్యులు ప్రాథమిక చికిత్స జరిపారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. రెండురోజులుగా ఆస్పత్రిలో ఉన్న సందీప్ మంగళవారం చనిపోయాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గోమారంలో..

శివ్వంపేట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కుటుంబ తగాదాలతో, మద్యం మత్తులో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డ సంఘటన గోమారం గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని గోమారం గ్రామానికి చెందిన నీరుడి శంకరయ్య (55) సోమవారం కుటుంబ సభ్యులతో ఘర్షణ పడ్డాడు. మద్యం మత్తులో ఉరి వేసుకున్నాడు.

విద్యుత్ స్తంభం ఎక్కి హల్‌చల్


విద్యుత్ స్తంభం ఎక్కిన విఠల్

రామాయంపేట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రోజూ మద్యం తాగి వచ్చి ఘర్షణ పడుతుండటంతో భార్య తిట్టింది. దీంతో ఓ వ్యక్తి విద్యుత్ స్థంబం ఎక్కి ఆత్మహత్య చేసుకుంటానని రెండు గంటల పాటు హల్‌చల్ చేశాడు. ఈ ఘటన రామాయంపేటలో మంగళవారం జరిగింది. పట్టణానికి చెందిన విఠల్ అనే వ్యక్తి ఇంట్లో గొడవ పడి పోలీస్ స్టేషన్‌కు వచ్చాడు. భార్య తిట్టిందని ఫిర్యాదు తీసుకోవాలని చెప్పడంతో వారు నిరాకరించారు. దీంతో ఆ వెంటనే పోలీస్ స్టేషన్ ఎదుటే ఉన్న పెద్ద విద్యుత్ స్థంబం ఎక్కి, ఆత్మహత్య చేసుకుంటానని కేకలు వేశాడు. దీంతో పోలీసులు వచ్చి, ఫైర్ సిబ్బంది సహాయంతో అతడిని కిందికి దింపేందుకు ప్రయత్నించారు. అయినప్పటికీ వినకపోవడంతో పోలీసులు, ఫైర్ సిబ్బంది సముదాయించి ఎట్టకేలకు కిందకు దింపటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. విఠల్ పై కేసు నమోదు చేసినట్లు సీఐ వెంకటరాజాగౌడ్ తెలిపారు. విద్యుత్ స్థంబం ఎక్కడంతో ఆ ప్రాంతంలో రెండు గంటల పాటు న్యూసెన్స్ నెలకొంది.

తల్లిని చంపిన కొడుకు జైలుకు..

రామచంద్రాపురం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): తల్లిని కిరాతకంగా చంపిన కొడుకును కొల్లూరు పోలీసులు మంగళవారం రిమాండ్‌కు తరలించారు. సీఐ రవీందర్ కథనం ప్రకారం... నవారి రాధికారెడ్డి(51)ని ఆమె రెండో కుమారుడు కార్తీక్‌రెడ్డి ఆస్తి కోసం సోమవారం కత్తితో పొడిచి చంపిన విషయం తెలిసిందే. అదే రోజు నిందితుడు కార్తీక్‌రెడ్డిని కస్టడీలోకి తీసుకున్న పోలీసులు, మంగళవారం కోర్టులో హాజరుపరిచి, అక్కడి నుంచి కందిలోని జిల్లా జైలుకు పంపించారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం



గజ్వేల్ రూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని మహిళ మృతదేహం మంగళవారం లభ్యం అయ్యింది. గజ్వేల్ ఎస్సై కథనం ప్రకారం.. పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద గుర్తు తెలియని మహిళ చనిపోయి ఉందని స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెళ్లి చూడగా, సుమారు 45 నుంచి 50 సంవత్సర మధ్య వయస్సు మహిళ చనిపోయి ఉంది. మహిళను ఎవరైనా గుర్తు పడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు.

టీచర్లకు పాఠాలు..!

2024 డీఎస్సీలో నియామకమైన వారికి.. ఈ నెల 12 వరకు తరగతులు

కొండపాక, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మారుతున్న విద్యావిధానంతో నూతనంగా నియామకమైన కొత్త తరం ఉపాధ్యాయులు పోటీపడాలని రాష్ట్ర ప్రభుత్వం శిక్షణ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. 2024 డీఎస్సీ ద్వారా నియామకమైన ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్, భాషా పండితులు తదితర విభాగాలకు చెందిన ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తోంది. ముందుగా ఎస్జీటీలకు, తర్వాత స్కూల్ అసిస్టెంట్, భాషా పండితులు, స్పెషల్ ఎడ్యుకేషన్, పీఈటీలకు ఈ నెల 12 వరకు శిక్షణ తరగతులు జరగనున్నాయి. ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వడానికి సీనియర్ ఉపాధ్యాయులను రిసోర్స్‌పర్సన్‌గా నియమించారు.

అన్ని అంశాల్లో అవగాహన

పాఠశాల నిర్వహణతోపాటు విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో ఎక్కువ శాతం చేరేలా బోధన సాగే ప్రధాన ఉద్దేశంతో శిక్షణ అంశాలు రూపొందించారు. ఆధునిక శాస్త్రసాంకేతికను అందిపుచ్చుకునే విధంగా, విద్యార్థుల సృజనాత్మకతను పెంపొందించేలా శిక్షణ ఇస్తున్నారు. పాఠ్య పుస్తక రూపకల్పన నేపథ్యం. పాఠ్యాంశ నిర్మాణ క్రమం, విద్యాబోధనలో పాఠ్యపుస్తకాన్ని సమర్థవంతంగా ఉపయోగించడం, పాఠ్యప్రణాళికలు రూపొందించడంలో మెలకువలు, నూతన బోధనా పద్ధతులు, మూల్యాంకనంలో మార్పులు, తొలిమెట్టు కార్యక్రమ ప్రాధాన్యత, డిజిటల్ విధానంలో బోధన ఏ విధంగా కొనసాగించాలి, విద్యాశాఖకు సంబంధించిన వివిధ కార్యక్రమాలు ఏ విధంగా నిర్వహించాలి వంటి వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. పాఠశాలలో నిర్వహించవలసిన కార్యక్రమాలు, వివిధ అంశాలను ఆన్‌లైన్ చేసే పద్ధతులు పాఠ్యాంశాలలో ఉన్నటు వంటి విద్యా ప్రమాణాలు, అభ్యసనా ఫలితాలపైనా అవగాహన కల్పిస్తున్నారు. పై అంశాలకు సంబంధించిన విశ్లేషణాత్మక మాడ్యూల్‌ను ఉపాధ్యాయులకు అందజేయనున్నారు.


శిక్షణ పొందుతున్న నూతనంగా నియామకమైన ఉపాధ్యాయులు

విద్యా కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో అందించేందుకు..



సిద్దిపేట జిల్లాలో నూతనంగా నియామకమైన సుమారు 157 మంది ఎస్జీటీలకు శిక్షణ ఇస్తున్నాం. ఉన్నత పాఠశాలలోని నూతన ఉపాధ్యాయులకు ఉమ్మడి జిల్లా స్థాయిలో శిక్షణ ఇవ్వనున్నారు. నూతన ఉపాధ్యాయుల నియామకం తర్వాత ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయ కొరత తీరింది. నూతన ఉపాధ్యాయులు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టే వివిధ విద్యా కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలి.

- ఈ.శ్రీనివాస్ రెడ్డి, సిద్దిపేట జిల్లా విద్యాధికారి

అంకిత భావంతో పని చేస్తేనే ఉత్తమ ఫలితాలు



నూతన ఎస్జీటీలు శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని, ఇక్కడ నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో పాఠశాలలో సమర్థవంతంగా వినియోగించుకుని ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి. నూతన సాంకేతికతను విద్యా బోధనలో ఉపయోగించుకుని సమర్థవంతమైన, నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందజేయాలి. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచడం నూతన ఉపాధ్యాయులు బాధ్యత. ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేసినప్పుడే ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద విద్యార్థులకు సరైన న్యాయం జరుగుతుంది.

- బేతి భాస్కర్, జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్

గుణాత్మక విద్య అందివ్వడానికి శిక్షణ



బోధనభ్యాస ప్రక్రియలు, పాఠ్యాంశ నిర్మాణ క్రమం, పాఠ్యాంశ బోధన, పాఠ్యపుస్తకాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవడం, మూల్యాంకన పద్ధతులు, తొలి మెట్టు వంటి వివిధ అంశాలపై నూతన ఉపాధ్యాయులు సంపూర్ణ అవగాహన పొందుతున్నారు. నూతన సాంకేతికతను విద్యా బోధనలో ఉపయోగించుకుని నాణ్యమైన, గుణాత్మక విద్యను అందించడంలో శిక్షణ ఉపయోగపడుతుంది. కాలానుగుణంగా వచ్చే మార్పులను గమనించి విద్యార్థి సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడేలా నూతన ఉపాధ్యాయులను తీర్చిదిద్దడం, సమర్థవంతమైన మార్గదర్శిగా ఉపాధ్యాయులను ప్రభావితం చేయడం ఈ శిక్షణ ప్రధాన ఉద్దేశం.

-పి.వి. సత్య కుమార్, స్టేట్ రిసోర్స్ పర్సన్



జేఎన్టీయూ విద్యార్థినికి సిల్వర్ మెడల్

పుల్‌కల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ విద్యార్థిని సిల్వర్ మెడల్ దక్కించుకుంది. కళాశాల ఆర్టిఫిషల్ విభాగంలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న పడకంటి పవిత్రాచారి చండీగఢ్ వర్సిటీలో నిర్వహించిన ఆల్ ఇండియా యూనివర్సిటీలో జరిగిన ఉమెన్స్ లీగ్‌లో పాల్గొని సిల్వర్ పతకాన్ని కైవసం చేసుకున్నారు. దేశంలో వివిధ ప్రాంతాల్లోని 131 విశ్వవిద్యాలయాలకు చెందిన 1,500 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. పవిత్రచారి సిల్వర్ మెడల్ సాధించడంతో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ జి.నరసింహ, క్రీడల విభాగం ఇన్‌చార్జి ప్రొఫెసర్ రజనీష్, జోషి శ్రీపాద అభినందించారు.

ప్రైవేటు అప్పుల నుంచి ఉపశమనం

రైతు రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు పాకాల శ్రీహరి రావు


మాట్లాడుతున్న రైతు రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు పాకాల శ్రీహరిరావు

సిద్దిపేట కలెక్టరేట్, మార్చి 04 (ఆంధ్రజ్యోతి): రైతులను ప్రైవేటు అప్పుల ఊబి నుంచి బయటపడేసేందుకు రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంకర్లకు మార్గదర్శకాలు జారీ చేసిందని రైతు రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు పాకాల శ్రీహరి రావు అన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో రైతు రక్షణ సమితి నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. పంట రుణాలకు అదనంగా మొదటి ప్రాధాన్యతతో దీర్ఘకాలిక వ్యవసాయ రుణాలను మంజూరు చేయాలని రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా అన్ని బ్యాంకులకు ఆదేశాలు ఇచ్చిందని ఆయన ఈ సందర్భంగా చెప్పారు. రాష్ట్ర హైకోర్టు కూడా రిజర్వ్ బ్యాంక్ ఇచ్చిన ఆదేశాలను అమలు చేయాలని మార్గదర్శకాలు ఇచ్చినందున సిద్దిపేట కోర్టులో న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బ్యాంకర్లతో, రైతు సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించామని ఆయన తెలిపారు. దీని ప్రకారం రైతులు దీర్ఘకాలిక వ్యవసాయ రుణాల కోసం వారి సంబంధిత బ్యాంకులలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో రైతు రక్షణ సమితి జిల్లా అధ్యక్షులు రామలింగారెడ్డి, రైతు రక్షణ సమితి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



గొట్టిముక్కుల శివారులో
చిరుత సంచారం

దాడిలో లేగదూడ మృతి

పెద్దశంకరంపేట, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మండల పరిధి గొట్టిముక్కుల శివారులో చిరుత సంచరిస్తుండడంతో గ్రామస్తులు, ప్రజలు భయాందోళన చెందుతున్నారు. గ్రామానికి చెందిన ఎండీ గౌస్ పొలం వద్ద సోమవారం రాత్రి లేగదూడ వేశాడు. మంగళవారం తెల్లవారుజామున లేగపై చిరుతపులి దాడి చేసి, లేగను చంపేసింది. విషయం తెలిసిన వెంటనే పెద్దశంకరంపేట ఫారెస్ట్ రేంజ్ అధికారి వికాస్, అటవీ శాఖ అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఆ ప్రదేశంలో చిరుత పులి పాదముద్రలు గుర్తించినట్లు ఎఫ్ఆర్‌వో వికాస్ తెలిపారు. చిరుత పులిని పట్టుకునేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. గ్రామస్తులు ప్రజలు రాత్రి సమయంలో పంట పొలాలకు అటవీ ప్రాంతంలో ఎవరు తిరుగవద్దని, జాగ్రత్తగా ఉండాలని ఆయన సూచించారు. ఆయన వెంట అటవీ శాఖ అధికారులు గ్రామస్థులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో నీటి సమస్య తలెత్తకుండా చూడాలి

● జడ్పీ సీఈవో ఎల్లయ్య

చేగుంట/మనోహరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని జడ్పీ సీఈవో ఎల్లయ్య అన్నారు. చేగుంట ఎంపీడీవో, మనోహరాబాద్ ఎంపీడీవో కార్యాలయాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తుగా పంచాయతీ కార్యదర్శులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని, అవసరమైన ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చిన్నారెడ్డి, సీనియర్ సహాయకులు శ్రీశైలం పాల్గొన్నారు. అనంతరం చిన్నశంకరంపేట మండల పరిషత్ కార్యాలయంలో కూడా రికార్డులను పరిశీలించారు.

రోడ్డు ప్రమాదంలో దంపతుల దుర్మరణం


ప్రమాదంలో దెబ్బతిన్న కారు, వివరాలు సేకరిస్తున్న పోలీసులు


బండ సాయిలు(ఫైల్), బండ మణెమ్మ (ఫైల్)

అల్లాదుర్గం, మార్చి 4. (ఆంధ్రజ్యోతి): తమకున్న కొద్దిపాటి భూమిలో కూరగాయల సాగు చేస్తారు. ఇరుగు, పొరుగు గ్రామాల్లో సంతలు ఎక్కడ జరిగితే అక్కడికి వెళ్లి వాటిని విక్రయించి జీవనం సాగిస్తారా దంపతులు. అయితే, రోడ్డు ప్రమాదం ఇద్దరినీ ఒకేసారి అనంతలోకాలకు తీసుకెళ్లింది. ఎదురుగా వచ్చిన కారు వీరి బైక్‌ను ఢీ కొట్టడంతో దంపతులు దుర్మరణం చెందారు. ఈ ఘటన మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలంలోని చిల్వర్ గ్రామ శివారు 161వ జాతీయ రహదారి కుసంబినగర్ (పల్లెగడ్డ) వద్ద మంగళవారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. అల్లాదుర్గంనకు చెందిన బండ సాయిలు (55), మాణెమ్మ (50) దంపతులు మంగళవారం తాము పండించిన కూరగాయాలు అమ్మేందుకు టేక్మాల్ మండలం బొడ్మట్‌పల్లి గ్రామంలో జరిగే సంతకు బైక్‌పై వెళ్లారు. కూరగాయలు విక్రయించి ఇంటికి తిరిగి వస్తుండగా, కుసంబినగర్ వద్ద జాతీయ రహదారిపై ఎదురుగా వేగంగా వస్తున్న కారు వీరి బైక్‌ను ఢీ కొట్టింది. దీంతో సాయిలు, మణెమ్మలు అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదంలో దంపతులను ఢీ కొన్న కారు డివైడర్ సైడ్ వాల్‌ను ఢీ కొని నుజ్జునుజ్జు అయింది. అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి పోలీస్ సిబ్బందితో సంఘటన స్థలానికి చురుకొని దర్యాప్తు చేపట్టారు. మృతి చెందిన వీరి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఆలయంలో బాలుడిని వదిలిపెట్టారు..


ఆలయం వద్ద దొరికిన బాలుడు

ఐడీఏబొల్లారం మార్చి 4 (ఆంధ్రజ్యోతి): నెలరోజుల బాలుడిని ఆలయంలో వదిలిపెట్టిన సంఘటన ఐడీఏ బొల్లారం పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. సీఐ రవీందర్‌రెడ్డి కథనం ప్రకారం.. ఐడీఏబొల్లారం పట్టణ పరిధి జగన్నాథస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి ఎనిమిది గంటల సమయంలో నెలరోజుల వయస్సున్న ఒక బాలుడు ఏడుస్తూ ఒక టేబుల్‌పై పడుకొని ఉన్నాడు. చుట్టుపక్కల బాలుడి చేరదీశారు. బాలుడి కోసం ఎవరూ రాకపోవడంతో గంట తర్వాత పోలీసులకు సమాచారం అందించారు. వారు వచ్చి చుట్టుపక్కల విచారణ జరిపారు. ఫలితం లేకపోవడంతో సంగారెడ్డి బాలల సంరక్షణ కేంద్రానికి అప్పగించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

చెరువులో ఇద్దరు గల్లంతు

ఒక మృతదేహం లభ్యం..

న్యాల్‌కల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): చెరువులో ఇద్దరు గల్లంతైన ఘటన మండల పరిధిలోని గంగ్వార్‌లో మంగళవారం సాయంత్రం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. మహారాష్ట్రలోని లాతూర్‌కు చెందిన సంజేయ్ కామడే (50) ఎస్‌కే ఫయిమ్(17)లు గంగ్వార్ శివారులోని ముల్తానీ బాబా దర్గా సందర్శనకు వచ్చారు. అనంతరం స్నానం చేయడానికి సమీపంలో గల చెరువుకు వెళ్లారు. అక్కడ స్నానం చేసేందుకు చెరువులోకి దిగారు. నీరు అధికంగా ఉండడం.. వారికి ఈత రాకపోవడంతో అందులో మునిగిపోయారు. చెరువుకు సమీపంలో ఉన్న వ్యక్తులు పోలీసులకు ఫోన్ ద్వారా సమాచారం అందజేశారు. పోలీసులు వచ్చి గాలింపు చర్యలు చేపట్టగా, సంజయ్ కామడే మృతదేహం దొరికింది. ఫయిమ్ మృతదేహం కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

ఏడుపాయల గొలుసు దొంగల అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి

పాపన్నపేట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల ఆలయ పరిసరాల్లో కొంత కాలంగా మహిళా భక్తుల మెడలోంచి బంగారు ఆభరణాల చోరీలకు పాల్పడుతున్న నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి మంగళవారం పాపన్నపేట ఠాణాలో వివరాలు వెల్లడించారు. కొల్చారం మండలం రంగంపేట గ్రామానికి చెందిన వడ్డే యాదయ్య, సంగారెడ్డి జిల్లా శివ్వంపేటకు చెందిన మక్కని నవీన్, ఉప్పు సాయికుమార్, ఆలకుంట నరేష్, మక్కని పవన్, వడ్డే శ్రీకాంత్, కొల్చారం మండలం చిన్నఘనపూర్‌కు చెందిన వడ్డే నర్సింలు కూలీపనులు, ఆటో డ్రైవర్‌లుగా పని చేస్తున్నారు. వీరు కొన్ని నెలలుగా ఏడుపాయల ఆలయం వద్ద సంచరిస్తూ ఆలయ పరిసరాల్లో ఉన్న సత్రాల్లో రాత్రి బస చేసే మహిళల బంగారు ఆభరణాలు తస్కరిస్తున్నారు. అర్ధరాత్రి సమయంలో సత్రాల్లోకి ప్రవేశించి, నిద్రిస్తున్న మహిళల మెడలోంచి నెయిల్ కట్టర్ సహాయంతో గొలుసును కట్ చేస్తారు. చోరీ చేసిన ఆభరణాలతో ఆటోలో పారిపోతారు. బాధితుల ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఈ నెల 3న రాత్రి ఏడుపాయల వద్ద పెట్రోలింగ్ చేస్తుండగా ఒక ఆటోలో కొందరు పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించగా వారిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. ఇటీవల జరిగిన చోరీలను అంగీకరించడంతో నిందితుల నుంచి సుమారు 12.1 తులాల బరువు గల 5 బంగారు మంగళసూత్రాలను రికవరీ చేశారు. చోరీలకు ఉపయోగించిన ఆటోను, నెయిల్ కట్టర్‌ను స్వాధీనం చేసుకొని నిందితులను రిమాండ్‌కు తరలించారు.

వీరు మెదక్, సంగారెడ్డి జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్‌లలో చోరీ కేసులలో సైతం నిందితులుగా ఉన్నట్లు తెలిపారు. చోరీ కేసులను ఛేదించిన పోలీసు అధికారులను, సిబ్బందిని ఎస్పీ అభినందించి రివార్డు అందజేశారు. కార్యక్రమంలో మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్, రూరల్ సీఐ రాజశేఖర్ రెడ్డి, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ రాజారెడ్డి, ఎస్సై శ్రీనివాస్ గౌడ్, ఏఎస్సైలు గాలయ్య, సంగన్న, కానిస్టేబుళ్లు దుర్గాప్రసాద్, విజయ్, నిర్మల, తదితరులున్నారు.

క్రైం కార్నర్

డ్రంకెన్ డ్రైవ్ నిందితులకు జరిమానా, జైలు శిక్ష

గజ్వేల్/కోహెడ/సిద్దిపేట క్రైం/చేర్యాల, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన పలువురిని మంగళవారం ఆయా పరిధిలోని కోర్టుల్లో హాజరుపరచగా జరిమానా, జైలు శిక్ష విధించాయి. గజ్వేల్ 12మందికి రూ. 13,400 జరిమానా విధించినట్లు గజ్వేల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మురళీ తెలిపారు. కోహెడ పోలీస్ స్టేషన్ పరిధిలో ముగ్గురికి ఏడు రోజుల జైలు శిక్ష, మరో తొమ్మిది మందికి జరిమానా విధించినట్లు ఎస్ఐ అభిలాష్ తెలిపారు. సిద్దిపేట జిల్లా కేంద్రం పరిసర ప్రాంతంలో, రాజీవ్ రహదారిపై తనిఖీల్లో పట్టుబడిన 23 మంది రూ.29,500 జరిమానా, వారిలో ఒకరికి 12 రోజులు, జైలు శిక్ష విధించినట్లు పోలీసులు తెలిపారు. అలాగే చేర్యాలలో 26మందికి ఒక్కొక్కరికి వెయ్యి రూపాయల చొప్పున జరిమానా విధించారు.

నాటుసారా పట్టివేత

మద్దూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : రవాణా నాటుసారాను పట్టుకుని వ్యక్తిపై కేసునమోదు చేసినట్లు చేర్యాల ఎక్సైజ్ ఎస్ఐ సురేశ్ తెలిపారు. మద్దూరు మండలం వంగపల్లి గ్రామంలో వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా, ధూళిమిట్ట మండలం హన్మతండాకు చెందిన ఇస్లావత్ రవి ద్విచక్ర వాహనంపై 8 లీటర్ల నాటుసారాను తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. అతడిని అరెస్టు చేసి బైక్, నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు.

ఇసుక ట్రాక్టర్..

ధూళిమిట్ట, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని జాలపల్లి గ్రామ పరిధిలోని మోయతుమ్మెద వాగు నుంచి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను మంగళవారం తహసీల్దార్ మధుసూదన్ పట్టుకున్నారు. కొండాపూర్ గ్రామానికి చెందిన మంద రాజు ట్రాక్టర్‌గా గుర్తించి రూ.15వేల జరిమానా విధించినట్లు తెలిపారు. అక్రమంగా ఇసుకను తరలిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

మాజీ ఎంపీటీసీ కన్నుమూత


కనకమ్మ (ఫైల్)

చేర్యాల, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మండలం ఐనాపూర్ గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ ఆత్కూరి కనకమ్మ(40) సోమవారం రాత్రి కన్నుమూశారు. కొంతకాలంగా ఆమె అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స తీసుకుంటున్నది. కాగా, తమ కులదైవమైన బీరప్ప దేవుడి కల్యాణం సందర్భంగా గుడి వద్దకు వెళ్లిన కనకమ్మ అకస్మాత్తుగా అస్వస్థతకు గురి కాగా, మొదట గజ్వేల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం నిమిత్తం హైదరాబాదులోని నిమ్స్‌కు తరలించగా అప్పటికే మృతిచెందింది. కనకమ్మ మృతిపై జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

దొంగకు జైలు

వర్గల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : దొంగకు గజ్వేల్ గౌరవ అదనపు ప్రథమ శ్రేణి న్యాయమూర్తి జైలు శిక్ష, జరిమానా విధించారు. గౌరారం ఎస్ఐ కరుణకర్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తూప్రాన్ మండల కేంద్రంలోని డబుల్ బెడ్ రూం ఇళ్ల కాలనీకి చెందిన సిరిగిరి నర్సింహులు (45) రెండు నెలల క్రితం వర్గల్ మండలం మీనాజీపేట గ్రామంలో దొంగతనం కేసులో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. విచారణలో నేరం రుజువైనందున గజ్వేల్ గౌరవ అదనపు ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రియంక నర్సింహులకు 6 నెలల జైలు శిక్ష, రూ. 1000 జరిమానా విధించారు.

అక్రమ ఇసుక డంపులు స్వాధీనం

కొండపాక, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కొండపాక మండలం అంకిరెడ్డిపల్లి గ్రామంలో అక్రమంగా డంపు చేసిన 30 టన్నుల ఇసుకను టాస్క్ ఫోర్స్ పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. గ్రామానికి చెందిన రేగులపల్లి పద్మారెడ్డి వ్యవసాయ పొలం వద్ద దండుగుల కనకయ్య అనే వ్యక్తి ఇసుకను అక్రమంగా డంపు చేశాడు. సమాచారం అందుకున్న టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడులు చేసి వాటిని స్వాధీనం చేసుకున్నారు. త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యభిచార గృహంపై దాడి

సిద్దిపేట అర్బన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): వ్యభిచార గృహంపై టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడి చేసి ఇంటి యజమానురాలుతోపాటు ఓ మహిళను, విటుడిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లి గ్రామ శివారులో బాలరాజు, యశోద తమ ఇంటిలో మహిళలను తీసుకువచ్చి వ్యభిచారం చేయిస్తుంది. సమాచారం అందుకున్న పోలీసులు మంగళవారం దాడులు చేసి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.1700, ఫోన్లు, బైక్ స్వాధీనం చేసుకున్నారు.


ములుగు మండల కేంద్రంలోని నిరుపయోగంగా ఫంక్షన్‌హాల్


కుకునూరుపల్లి మండలం తిప్పారంలో..

ఆంధ్రజ్యోతి ఫోకస్

కోట్లు వెచ్చించారు.. వదిలేశారు

- అర్ధాంతరంగా నిలిచిపోయిన గ్రామీణ ఫంక్షన్‌హాళ్ల నిర్మాణం
- గజ్వేల్ నియోజకవర్గంలో 68కి పూర్తయినవి 20 మాత్రమే
- వాటిలోనూ వసతులు లేకపోవడంతో వినియోగించలేని పరిస్థితి
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన వైనం

గజ్వేల్, గజ్వేల్ డివిజన్ నెట్‌వర్క్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి నియోజకవర్గంలో ఎంతో హంగు ఆర్భాటంతో ప్రత్యేక అభివృద్ధి నిధి(ఎస్‌డీఎఫ్)తో గ్రామాల్లో ఫంక్షన్‌హాళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ప్రజలకు సౌకర్యవంతంగా గ్రామాల్లోనే శుభ కార్యాలు చేసుకునేలా ఇవి ఉపయోగపడుతాయని బాకా ఊదారు. కానీ, ఎక్కడా పూర్తిస్థాయిలో ఫంక్షన్ హాల్స్ అందుబాటులోకి రాకపోవడంతో కోట్లాది రూపాయలు వెచ్చించినా కొసకు వదిలేశారన్న అపవాదును గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం మూటగట్టుకోగా, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం వాటిని పట్టించుకోవడం లేదు. దీంతో అవి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయి. వాటిలో మందుబాబులు యథేచ్ఛగా మద్యాన్ని సేవిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారు.

రూ.31.64 కోట్లతో..

గజ్వేల్ నియోజకవర్గంలో 175 గ్రామాలుండగా.. 68 ఫంక్షన్‌హాళ్ల నిర్మాణానికి రూ.31.64కోట్ల నిధులను గత ప్రభుత్వం మంజూరు చేసింది. కొన్ని గ్రామాల్లో నిర్మాణం చేపట్టగా.. మరికొన్ని గ్రామాల్లో భూసేకరణ సమస్యగా మారడంతో వదిలేశారు. గజ్వేల్ మండలంలో 13 ఫంక్షన్‌హాళ్లు మంజూరవగా రెండు మాత్రమే పూర్తయ్యాయి. జగదేవ్‌పూర్ మండలంలో 13కు మూడు, కొండపాక, కుకునూరుపల్లి మండలాల్లో 17కు 10, మర్కుక్ మండలంలో ఆరింటికి మూడు ఫంక్షన్‌హాళ్లను పూర్తి చేశారు. ఇక ములుగు మండలంలో ఏడింటిలో ఒకటీ పూర్తికాకపోగా, తూప్రాన్ మండలంలో 4, మనోహరాబాద్ మండలంలో 6 ఫంక్షన్‌హాల్స్ సైతం పెండింగ్‌లోనే పడ్డాయి. వీటిలో కొన్ని భూసమస్యలతో నిలిచిపోగా, ఇంకొన్ని బిల్లులు చెల్లించలేకపోవడంతో అర్ధాంతరంగా నిలిచిపోయాయి.

ప్రారంభించినా అందుబాటులోకి రాక...

పలు గ్రామాల్లో ఫంక్షన్‌హాల్స్‌ను మాజీ మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా ప్రారంభించారు. కానీ కుర్చీలు, వంట సామగ్రి, షామియానాలు, మైక్ సెట్, ఇతరత్రా సామగ్రి అందుబాటులో లేకపోవడంతో నిరుపయోగంగా మారిపోయాయి. అటు ప్రభుత్వం పట్టించుకోకపోగా, ఇటు గ్రామపంచాయతీలకు పాలకవర్గాలు లేకపోవడంతో వాటిని పట్టించుకునే వారే కరువయ్యారు. దీంతో మందుబాబులకు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిపోయాయి. ఇప్పటికైనా జిల్లా అధికారులు, ప్రభుత్వం స్పందించి ఫంక్షన్‌హాల్స్‌ను అందుబాటులోకి తేవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


కొండపాక మండలం వెలికట్టలోని ఫంక్షన్‌హాల్‌లో దర్శనమిస్తున్న ఖాళీ మద్యం సీసాలు

ప్రణాళిక ప్రకారం చదవాలి : డీఈవో


పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో శ్రీనివాసరెడ్డి

కొండపాక, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ప్రణాళిక ప్రకారం చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని డీఈవో ఎల్ఎంకే శ్రీనివాసరెడ్డి అన్నారు. కొండపాక మండలం మర్పడగ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆయన తనిఖీ చేసి పదోతరగతి విద్యార్థులతో మాట్లాడారు. పరీక్షల కోసం విద్యార్థుల సన్నద్ధతను పరీక్షించారు. ఇప్పటివరకు ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న ప్రాక్టీసు పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

రామలింగేశ్వర స్వామి ఆలయ హుండీ లెక్కింపు



ధూళిమిట్ట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : మండలం పరిధి బెక్కల్ గ్రామంలోని రామలింగేశ్వరస్వామి ఆలయ హుండీని మంగళవారం లెక్కించారు. బుగ్గ రాజేశ్వరస్వామి ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీధర్ రెడ్డి, ఆలయ చైర్మన్ చొప్పరి మల్లేశం, డైరెక్టర్ల ఆధ్వర్యంలో లెక్కింపు నిర్వహించారు. 39 రోజులకు గాను రూ.79,844 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి విశ్వనాథశర్మ తెలిపారు. హుండీ లెక్కింపులో కోటిలింగాల సేవ సమితి సభ్యులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణపై విచారణ

మద్దూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నర్సాయపల్లిలో డబుల్‌బెడ్ రూం ఇళ్ల వద్ద ఖాళీ స్థలం ఆక్రమణపై గ్రామస్థులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ రహీం స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. పూర్తి విచారణ అనంతరం నివేదికను అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ రమేష్, వీఆర్ఏ వెంకటేష్, గ్రామస్థులు ఉన్నారు.


రంగాయిపల్లిలో గోదావరి జలాలకు పూజలు చేస్తున్న మహిళలు

'అపర భగీరథుడు ఎమ్మెల్యే హరీశ్‌రావు'

చిన్నకోడూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు కృషితోనే గ్రామాల్లోని చెరువులలోకి గోదావరి జలాలు చేరుతున్నాయని తాజా మాజీ సర్పంచ్‌లు నవీన్, శ్రీనివాస్ అన్నారు. రంగనాయక సాగర్ రిజర్వాయర్ ఎడమ కాలువ కింద ఉన్న పిల్ల కాలువ ద్వారా మండలంలోని రంగాయిపల్లికి గోదావరి జలాలు చేరుకోవడంపై హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం బీఆర్‌ఎస్ నాయకులు రంగాయిపల్లిలో కాలువ వద్ద విఠలాపూర్, రంగాయిపల్లి, కొత్తపల్లి, చెల్కలపల్లి గ్రామాల ప్రజలతో కలిసి మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. అంతకుముందు మహిళలు గోదావరి జలాలకు పూజలు చేసి హారతి ఇచ్చారు. ఈ సందర్భంగా మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుకు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

వర్గీకరణ సాధనకు దండోరా మోగించాలి

● ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు పరశురాములు

హుస్నాబాద్ టౌన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : మాదిగల వర్గీకరణ సంపూర్ణంగా సాధించాలంటే రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి మండల కేంద్రంలో డప్పులతో దండోరా మోగించాలని మహాజన సోషలిస్టు పార్టీ(ఎంఎస్‌పీ) జిల్లా అధ్యక్షుడు పెర్క పరశురాములు మాదిగ పిలుపునిచ్చారు. హుస్నాబాద్ పట్టణంలో మంగళవారం జరిగిన ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. జస్టిస్ షమీ అక్తర్ కమిషన్ రిపోర్టు ఈ నెల 10వ తేదీ వరకు గడువు ఉన్నందున గతంలో ఇచ్చిన నివేదికలో ఉన్న లోపాలను సవరించి ఎస్సీ వర్గీకరణ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. మాదిగలు అధికంగా ఉన్న తెలంగాణలో రెండు మంత్రి పదవులు ఇవ్వాలని కోరారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం రాజు, నియోజకవర్గ ఇన్‌చార్జి మాట్ల వెంకటస్వామి,నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వేసవి విద్యుత్‌కు ఇబ్బందుల్లేవ్..!

5వ పేజీ తరువాయి..

వేల మందికి పైగా గృహజ్యోతి లబ్ధిదారులు 200 యూనిట్లు దాటడంతో బిల్లులను అందజేశారు. దీంతో గృహజ్యోతి పథకానికి అర్హు లు కాని వినియోగదారుల నుండి దాదాపు రూ.9కోట్లు మాత్ర మే వసూలు చేస్తున్నారు. గృహజ్యోతి లబ్ధిదారులకు జీరో బిల్స్ ఇస్తుండటంతో వాటి బిల్లు దాదాపు రూ.7కోట్లకుపైగా విద్యుత్ శాఖకు ప్రభుత్వం చెల్లిస్తున్నది.

అన్ని చర్యలు చేపట్టాం



విద్యుత్ సరఫరా విషయంలో జిల్లా వ్యాప్తంగా గృహవినియోగదారులకు, రైతులకు, వ్యాపారులకు ఎలాంటి కోతలు లేకుండా అన్నీ చర్యలు చేపట్టాం. గతంలో ఎక్కడైనా పొరపాట్లు ఉంటే వాటిపైనా దృష్టి సారించాం. ఎక్కడా కూడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రూ. 45 కోట్లతో అన్ని పనులను పూర్తి చేశాం. మెయింటెనెన్స్ మినహా అవసరమైతే తప్ప ఎక్కడా కూడా విద్యుత్ కోతలు లేకుండా చర్యలు తీసుకున్నాం. త్రీ ఫేజ్ విద్యుత్‌లో ఉదయం ఏమైనా సమస్య ఉంటే వెంటనే పరిష్కరిస్తాం. పని సమయం పడితే, పట్టిన సమయాన్ని ఎక్కువగా ఇస్తాం. విద్యుత్ విషయంలో ఎలాంటి రాజీ పడేదిలేదు.

-టీ.ఆర్.చంద్రమోహన్, ఎస్ఈ, విద్యుత్‌శాఖ, సిద్దిపేట

పడితే ప్రాణాలు హరి!



కొమురవెల్లి మండల కేంద్రం ఆర్టీసీ బస్టాండు ఆవరణలోని ఓ రియల్ ఎస్టేట్ వెంచర్‌లో విద్యుత్ లైన్‌ను సవరించేందుకు మంగళవారం విద్యుత్ లైన్ షిఫ్టింగ్ పనులు చేపట్టారు. కార్మికుడు తలకు రక్షణ కవచం ధరించకుండా, కనీసం తాడైన కట్టుకోకుండా విద్యుత్ స్తంభంపైకి ఎక్కి తీగను సరి చేయసాగాడు. ఒక పాదం స్తంభంకు బిగించిన పరికరంపై, మరొకపాదం క్రేన్ పైభాగం చివరన పెట్టి గాలిలో పనులు చేస్తున్నాడు. ఏమాత్రం ఆదమరిచినా కిందపడిపోయి నిండుప్రాణం కోల్పోయే పరిస్థితి నెలకొన్నప్పటికీ కాంట్రాక్టర్‌తో పాటు విద్యుత్‌శాఖ సిబ్బంది నిర్లక్ష్యపు ధోరణితో తమకేం పట్టనట్లుగా వ్యవహరించడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు.

- చేర్యాల, మార్చి 4, (ఆంధ్రజ్యోతి)

కొమురయ్య గెలుపుపై బీజేపీ సంబరాలు


దుబ్బాకలో పరస్పరం స్వీట్లు తినిపించుకుంటూ హర్షం వ్యక్తం చేస్తున్న బీజేపీ నాయకులు

దుబ్బాక /హుస్నాబాద్ టౌన్, మార్చి4 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా బీజేపీ బలపర్చిన అభ్యర్థి మల్క కొమురయ్య గెలుపొందడంతో ఆ పార్టీ నేత సంబరాలు చేసుకున్నారు. మంగళవారం దుబ్బాక బస్టాండ్ వద్ద, హుస్నాబాద్ పట్టణంలో బీజేపీ నాయకులు టపాసులు పేల్చి, మిఠాయిలను పంచుకున్నారు. బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు బాలేష్‌గౌడ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి నాయకులు పాల్గొన్నారు.

పగిలిన పైప్‌లైన్.. వృథాగా నీరు..



గజ్వేల్ రూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ మండలం కొడకండ్ల గ్రామంలో డబుల్ బెడ్‌రూం ఇళ్లకు వెళ్లే దారిలో దుర్గమ్మ దేవాలయం వద్ద మిషన్‌భగీరథ పైపు పగిలిపోయింది. దీంతో తాగునీరంతా వృథాగా పోతున్నది. తక్షణమే అధికారులు స్పందించి మరమ్మతులు చేసి నీటి వృథాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మోడల్ టాయిలెట్స్ నిర్మాణానికి స్థల పరిశీలన


స్థలాన్ని పరిశీలిస్తున్న డీఈఓ జ్యోతి

మర్కుక్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అంగడికిష్టాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రూ.2 లక్షలతో మోడల్ టాయిలెట్స్‌ని నిర్మించనున్నారు. ఈ మేరకు మంగళవారం సిద్దిపేట జిల్లా సీనియర్ క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ జ్యోతి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాలకిషన్‌తో కలిసి స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ పాఠశాలలో బాలికలు ప్రాథమికోన్నత స్థాయిలో 30 మందికి పైగా ఉండడంతో తప్పనిసరిగా మోడల్ టాయిలెట్స్ నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. వారి వెంట జూనియర్ క్వాలిటీ కంట్రోల్ అధికారి సంతోష్ రెడ్డి, స్వామి, ఎస్ఎంసీ చెర్మన్ బాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు సంతోషిమాత, హారిక, చిన్నికృష్ణ తదితరులు ఉన్నారు.

మోడల్ స్కూల్ బృందం సందర్శన..

అంగడికిష్టాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను జగదేవ్‌పూర్ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ స్లివరాజ్, సైన్స్ టీచర్ దివాకర్‌రెడ్డి, కంప్యూటర్ టీచర్ కరుణాకర్‌లతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా 8వ తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ జగదేవ్‌పూర్‌లోని మోడల్ స్కూల్‌లో అత్యాధునిక వసతులున్నాయన్నారు. అనుభవం గల ఉపాధ్యాయులతో ఆంగ్ల మాధ్యమంలో నాణ్యమైన బోధన అందిస్తున్నామన్నారు. గ్రామీణ విద్యార్థులకు ఈ స్కూల్ గొప్ప అవకాశమని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘనంగా పెద్దమ్మ తల్లి జాతర


పెద్దమ్మ తల్లి ఉత్సవాలకు అంకురార్పణ చేస్తున్న వేద పండితులు

వర్గల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : వర్గల్ మండల కేంద్రంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మ తల్లి జాతర మహోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం అమ్మవారికి విశేష పంచామృతాభిషేకాలు, వేద పండితులు వెంకటరమణ శర్మ ఆధ్వర్యంలో పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పులి విక్రమ మహారాజ్, పెద్దమ్మ తల్లి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

వైభవంగా రేణుకాఎల్లమ్మ కల్యాణం

వర్గల్ మండల కేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో రేణుకా ఎల్లమ్మ తల్లి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మంగళవారం అమ్మవారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. సాయంత్రం ఎల్లమ్మ తల్లితో పాటు గ్రామ దేవతలకు డప్పు చప్పుళ్ల, పోతరాజుల విన్యాసాల మధ్య మహిళలు బోనాలను ఊరేగింపుగా తీసుకువచ్చి సమర్పించారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు, తదితరులు ఉన్నారు.

వరిలో తెగుళ్ల నివారణకు సూచనలు

చేర్యాల, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మండలం మర్రిముస్యాల గ్రామంలో అగ్గితెగులు సోకిన వరి పొలాలను మంగళవారం జిల్లా వ్యవసాయశాఖాధికారి రాధిక, కొమురవెల్లి ఏవో వెంకట్రావమ్మ పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి అగ్గితెగులు, కాండం తొలిచే పురుగు ఉధృతి నివారణకు తీసుకోవాల్సిన చర్యలను సూచించారు. నత్రజని యూరియా ఎరువుల వాడకాన్ని తాత్కాలికంగా నిలిపివేయాలని తెలిపారు. పిచికారీ చేయాల్సిన మందులను సూచించారు. వారి వెంట ఏఈవో రమ్య, రైతులు ఉన్నారు.

ఎండిపోతున్న పంటల పరిశీలన



పంట పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారి

సిద్దిపేట అర్బన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల గ్రామంలో సాగునీరు లేక ఎండిపోతున్న పంట పొలాలను మంగళవారం వ్యవసాయ శాఖ మండల అధికారి శ్రీనాథ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో నీటి లభ్యతను దృష్టిలో పెట్టుకొని పంటలు సాగుచేసుకోవాలని, వీలైనంతవరకు ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలని సూచించారు.

'ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలి'

చేర్యాల, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు క్రమశిక్షణతో మెదులుతూ ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేస్తూ ఉన్నత లక్ష్యానికి చేరుకోవాలని ప్రముఖ మోటివేషనల్ స్పీకర్, సినీ క్యారెక్టర్ ఆర్టిస్ట్ కేవీ ప్రదీప్ అన్నారు. చేర్యాల మండలానికి చెందిన పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన సుమారు 600మంది పదవతరగతి విద్యార్థులతో సోమవారం చేర్యాల పట్టణంలోని సద్గురు సదనంలో శారదా సరస్వతి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. విద్యార్థులు వార్షిక పరీక్షలంటే భయాందోళన చెందకూడదని, అవకాశం, ఆత్మవిశ్వాసం అనే రెండురెక్కలు వినియోగించడం కర్తవ్యంగా మలచుకోవాలని సూచించారు. అనంతరం బాసర సరస్వతి దేవాలయం నుంచి పూజ చేయించబడిన ఎగ్జామ్‌కిట్‌ను విద్యార్థులకు అందజేశారు.

ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌పై అవగాహన


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సునీత

సిద్దిపేట కల్చరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేటలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో మంగళవారం ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ సెల్, కృషికల్ప సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు భవిష్యత్ వ్యవస్థాపకులుగా ఎదగడానికి కావాల్సిన నైపుణ్యం పెంపొందించుకోవడానికి చేయవలసిన కృషిని వివరించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యా ప్లానింగ్ కోఆర్డినేటర్ రామస్వామి మాట్లాడుతూ కలెక్టర్ చొరవతో జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న నైపుణ్య అభివృద్ధి కార్యక్రమాన్ని విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి సునీత మాట్లాడుతూ కృషికల్ప స్వచ్ఛంద సంస్థ సీఈవో సీఎం పాటిల్‌కి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ సెల్ సమన్వయకర్త గురుచరణ్ దాసు, వైస్ ప్రిన్సిపాల్ అయోధ్య రెడ్డి, ఉమామహేశ్వరి, పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ గోపాల సుదర్శనం, డాక్టర్ సీహెచ్ మధుసూదన్, పిట్ల దాసు, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.